క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేత సతీమణి మృతి


యాడిక సుబ్బరత్నం (ఫైల్)

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన నాగంబొట్లపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు యాడిక యలమంద రెడ్డి సతీమణి సుబ్బారత్నం (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆమెకు ఇద్దరు పిల్లలు. మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు కోట శివలక్ష్మి రామిరెడ్డి, చిమట సుబ్బారావు, షేక్ వలి, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, గంగమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జక్కుల రామకృష్ణ, ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్‌రెడ్డి, గుజ్జుల యోగిరెడ్డి, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి (గోల్డ్), గూడా గోపాల్‌రెడ్డి, కుమ్మిత జయరామిలు సంతాపం తెలిపారు.

వృథాగా సాగర్ నీరు


వృథాగా పోతున్న సాగర్ నీరు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు మెయిన్‌బజారులో ఉన్న సాగర్‌పైపులైన్ పగిలిపోయి శనివారం రాత్రి సాగర్‌నీరు వృథాగా వీధుల్లో పారింది. వేసవికాలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో సాగర్ పైపులైను పగిలి నీరు వృథా కావడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని కోరారు.

విద్యుత్ కోతలతో అన్నదాతల వెతలు


సమస్యలు తీర్చని విద్యుత్ సబ్‌స్టేషన్


రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం

కురిచేడు: ఎండలు మండుతున్నాయ్. సాగర్ నీరు నిలిచిపోయింది. పంటలు సాగులో ఉన్నాయి. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతల వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నా నిత్యం అప్రకటిత విద్యుత్ కోతలతో పాటు సిబ్బంది కొరత అన్నదాతను మరింత కష్టాల్లోకి నెట్టింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు మండలంలోని విద్యుత్ శాఖలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపక పోవడంతో అన్నదాతలతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్లలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది కరువయ్యారు. కురిచేడుకు 9 నెలలుగా లైన్‌మెన్ లేక పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని బోధనంపాడు, పొట్లపాడు, పడమర వీరాయపాలెం గ్రామాలకు ఏఎల్ఎంలు లేక పోవటంతో ఆయా గ్రామాల ప్రజలు రోజుల తరబడి అంధకారంలో మగ్గుతున్నారు. ఎవరిని అడగాలో అర్థంగాక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనా ఇంతవరకు దాని పనులు ప్రారంభించకుండా విద్యుత్ శాఖాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆ సబ్‌స్టేషను ఏర్పాటైతే కల్లూరు, పాత కల్లూరు, పడమరకాశీపురం గ్రామాల రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరాతో పాటు లోవోల్టేజీ సమస్య తీరుతుంది. ఆవులమంద విద్యుత్ సబ్‌స్టేషనులో లోవోల్టేజీ సమస్యను తీర్చి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు 5 ఎంఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చిపెట్టి నెల రోజులైనా ఇంతవరకు దానికి కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకురాలేదంటే విద్యుత్ శాఖ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. రోజూ అప్రకటిత విద్యుత్ కోతలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు రోజులకు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ సందర్భంగా తొలగించాల్సిన విద్యుత్ స్తంభాలు ఏళ్లు గడుస్తున్నా తొలగించక పోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో పాటు వాహనాలు ఢీకొట్టుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి ఈ మండు వేసవిలో ప్రజలకు విద్యుత్ సౌకర్యం అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..విద్యార్థినులకు శాపం!


బాలికల వసతి గృహం నిర్మిస్తుంది ఇక్కడే

కురిచేడు: విద్యార్థినులకు వసతి గృహాన్ని రెండు కోట్ల రూపాయలతో స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్నారు. విద్యార్థినులకు రక్షణ ఎక్కడ ఉంటుందనే అంశాన్ని పక్కన పెట్టి వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో పాటు దాని ఆవరణలో గ్రామస్తులు వాకింగ్ చేసేందుకు వస్తుంటారు. యువకులు నిత్యం ఆటలాడుకునేందుకు వస్తుంటారు. దీంతో విద్యార్థినులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించటం కష్టసాధ్యంగా ఉంటుందన్న విషయాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు స్థలం చూపలేదని సాకు చూపి అక్కడ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికంగా ఎన్ఎస్‌పీ కాలనీలో సుమారు 23 ఎకరాలు ఉంది. అందులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల, బీసీ హాస్టల్, గురుకుల పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ముఖ్యంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పక్కన ఉన్న స్థలంలో బాలికల వసతిగృహం నిర్మిస్తే విద్యార్థినులకు రక్షణ ఉంటుంది. అలా కాకుండా ఆ స్థలంతో పాటు భవనాలు ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలకు 20 ఏళ్ల క్రితం లీజుకు ఇచ్చారు. కళాశాల నిర్వహణ లేక సుమారు 8 సంవత్సరాలవుతున్నా ఆ భవనాలు, స్థలం కళాశాల లీజు పరిధిలోనే ఉన్నాయి. కళాశాలకు లీజు ఉందనే సాకు చూపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాస్టల్ నిర్మించడంపై మండల ప్రజలు విమర్శిస్తున్నారు. కలెక్టర్ చొరవ చూపి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పక్కన బాలికల వసతి గృహం నిర్మించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జీఓ 117కు ప్రత్యామ్నాయంతో విద్యావ్యవస్థ నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

దర్శి (కురిచేడు): ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీఓ నంబర్ 117తో విద్యావ్యవస్థ కునారిల్లిపోయిందని, నేడు అధికారంలోకి రాగానే 117కి ప్రత్యామ్నాయ మార్గాలంటూ కూటమి నాయకులు వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. జీఓ 117ను రద్దు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాటమార్చారని విమర్శించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలో తెచ్చిన మార్పులు ఏ మాత్రం ఉపాధ్యాయులకు మేలు చేయలేదని యూటీఎఫ్ తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యావ్యవస్థను నిజంగా అభివృద్ధి చేయాలనే భావన ప్రభుత్వానికి ఉంటే మోడల్ ప్రైమరీ వ్యవస్థను గతంలో తీసుకొచ్చారని, అదే ప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. ఫౌండేషన్ స్కూల్ ఏర్పాటు చేయడం, బేసిక్ ప్రైమరీల సంఖ్య తగ్గించటం విద్యావ్యవస్థకు మంచిది కాదని హితవు పలికారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి విద్యను దూరం చేస్తే ఇప్పుడు 1500 పాఠశాలల్లో 1–5 తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పటం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లతో విద్యను అందించాలని, ఆ పాఠశాలల్లో ఉన్న ఎస్జీటీలను నాటి ప్రభుత్వం పక్కకు పంపింది. ఇప్పుడు అదే పాఠశాలల్లో ఎస్జీటీలతో బోధన చెప్పిస్తామనటం ఎంతవరకు సబబన్నారు. మిగిలిన స్కూల్ అసిస్టెంట్లని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తామని చెప్పడం వీరినే ఉన్నత పాఠశాలల్లో ఉంచితే సరిపోదా? అని నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5000 ఫౌండేషన్ స్కూళ్లు ఉన్నాయని చెప్తున్న ప్రభుత్వం విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:30, ఉన్నత పాఠశాలల్లో 1:10గా ఉంచటం ఎంతవరకు సమర్థనీయమన్నారు. ఆర్టీఈ యాక్ట్ ప్రకారం 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించాలని, ఫౌండేషన్ స్కూల్స్‌ను రద్దు చేసి బేసిక్ ప్రైమరీ స్కూల్స్ ఉంచాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని, జీఓ 117ను రద్దు చేయాలని, ఎటువంటి ప్రత్యామ్నాయాలు వద్దని యూటీఎఫ్ పక్షాన ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాశీం, గౌరవ అధ్యక్షుడు ఎం.యలమందారెడ్డి, కోశాధికారి కె.రామారావు, సహాధ్యక్షుడు అట్లూరి రామారావు, సీనియర్ నాయకులు రామిరెడ్డి, కార్యదర్శులు కె.విజయ్‌భాస్కర్, ఎం.తిరుపతిరెడ్డి, ఎం.రమణారెడ్డి, వెంకటేవ్వర్లు, రోశయ్య, వెంకటేశ్వర్లు, పిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొంద్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీ ప్రసాద్‌స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


సరస్వతీదేవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ రమాదేవి

దర్శి (కురిచేడు): ప్రైవేటు పాఠశాలలక దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బి.రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని తూర్పు వీరాయపాలెం ప్రీ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు అట్లూరి రామారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమాదేవి ముందుగా సరస్వతి విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పాఠశాలలు ఒక వరంలా మారాయన్నారు. ఏకేఎస్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు తల్లిదండ్రులు లేని ఐదుగురు విద్యార్థులకు నూతన దుస్తులతో పాటు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రవిబాబు, యూటీఎఫ్ జిలా కార్యదర్శి టి. రాజశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, అశ్విని, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

రుషికొండ భూములు టీసీఎస్ కంపెనీకి ధారాదత్తం

పెద్దారవీడు: రాష్ట్ర ఆర్థిక రాజధానిగా పేరొందిన విశాఖపట్నం నగరంలోని రుషికొండ ప్రాంత భూములను టీసీఎస్ కంపెనీకి ప్రభుత్వం అప్పనంగా అప్పగించడం చాలా దారుణమని సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఇంటలెక్చువల్ అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ ఖండించారు. ఆయన మాట్లాడుతూ రుషికొండ ప్రాంతంలో ఎకరం కేవలం 99పైసల చొప్పున టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కంపెనీకి 21.16 ఎకరాలు లీజుకు అప్పజెప్పడం చాలా విడ్డురంగా ఉందన్నారు. రుషికొండ భూమి విలువ రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ రేట్ల ప్రకారం ఒక చదరపు గజం రూ.30 వేలు ఉందని, దాన్ని ప్రాతిపదికగా తీసుకున్నా ఎకరం సుమారు రూ.15 కోట్లు, మొత్తం 21.16 ఎకరాల భూమి విలువ సుమారు రూ.320 కోట్లకు మించి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2012లో జారీ చేసిన జీఓఎంఎస్ 371 రెవెన్యూ ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు ఇవ్వరాదని చట్టంలో పొందుపరచారని గుర్తు చేశారు. 2 జీ స్పెక్ట్రమ్ కేసులో, ఇతర కేసుల్లో ప్రభుత్వ భూముల వంటి ప్రకృతి వనరుల విషయంలో ప్రభుత్వం ప్రజల ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలని, ఆ భూములను ప్రజా ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిన విషయం అందరికీ తెల్సిందేనని పేర్కొన్నారు. 2024వ సంవత్సరంలో టీసీఎస్‌కు రూ.62,165 కోట్లు లాభం గడించగా అటువంటి కంపెనీకి ఎకరం కేవలం 99 పైసలు లీజుకు విలువైన ప్రభుత్వ భూమిని ముట్టజెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రైవేట్ కంపెనీలు ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్లు అమలు చేయడం లేదన్నారు. పైగా గతంలో చాలా కంపెనీల యాజమాన్యాలు పెట్టుబడులు పెడతామని, ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చి చౌకగా ప్రభుత్వ భూములు తీసుకున్నారే తప్ప యువతకు ఎలాంటి ఉద్యోగాలు కల్పించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ప్రైవేట్ కంపెనీల ఆధీనంలోనే ఉండటమే కాకుండా వాటిని బ్యాంకులో కుదవ పెట్టి భారీగా రుణాలు తీసుకొని, వాటిని ఎగొట్టిన ఉదాంతాలు ఉన్నో ఉన్నాయని, ఉదాహరణకు అనంతపురం లేపాక్షి మొదలు శ్రీకాకుళం జిల్లా థర్మల్ కేంద్రాల వరకు వేల ఎకరాలు భూములు కార్పొరేట్ కంపెనీల కబంధహస్తాల్లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం టీసీఎస్ విషయంలో తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, రుషికొండలోని ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించడం మంచిదని డిమాండ్ చేశారు.

నేటి నుంచి 6వ తరగతిలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం నుంచి 6వ తరగతిలో ప్రవేశానికి ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల ఫలితాలు ఈ నెల 16న విడుదలయ్యాయని చెప్పారు. ఆ ఫలితాలను తమ అధికారిక వెబ్‌సైట్‌లో, లేదా స్కూల్ బోర్డులో చూసుకోవచ్చన్నారు. 6వ తరగతిలో చేరబోయే విద్యార్థులు ఫలితాల ప్రింటౌట్, విద్యార్థి జనన సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, కుల ఆదాయ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94160 94165, 63903 55767 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పుల్లలచెరువు విద్యార్థికి 791వ ర్యాంక్


ఉప్పాల మణికంఠనాయుడు

పుల్లలచెరువు: జేఈఈ మెయిన్స్‌లో పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి చెందిన ఉప్పాల మణికంఠనాయుడు 791 ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఉప్పాల చిన్నకొండలు, పద్మావమ్మల సంతానం ఇద్దరూ జేఈఈలో ర్యాంక్‌లు సాధించడం విశేషం. వీరి పెద్ద పెద్ద కుమారుడు శివసాయి చరణ్‌తేజ 2023లో ర్యాంక్ సాధించి ఉత్తరాఖండ్‌లో రూర్కి ఐఐటీలో విద్యను అభ్యసిస్తున్నాడు. రెండో కుమారుడు ఇంటర్‌లో 986 మార్కులు సాధించి శనివారం విడుదలైన ఫలితాల్లో 791 ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. చిన్న కొండలు వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను బాగా చదవించడంలో సఫలమయ్యారు. చిన్నకొండలు తన స్వ గ్రామంలోని పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న సుమారు 200 మంది విద్యార్థులకు పదేళ్ల నుంచి నోట్‌పుస్తకాలు, పెన్నులు, పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. మణికంఠను గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా మనికంఠ మాట్లాడుతూ మంచి కాలేజీలో ఐఐటీ చదివి సివిల్స్ రాసి కలెక్టరై పేద ప్రజలకు సాయం చేయాలనేది తన కోరిక అని మణింకఠ తెలిపారు.

సిలిండర్ ప్రమాదాలు నివారించడంపై అవగాహన


అగ్ని ప్రమాదాలపై డెమో చేసి చూపుతున్న సిబ్బంది


పెద్దదోర్నాల: శ్రీరంగా వైద్యశాలలో..

దర్శి (కురిచేడు): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాలతో కలిగే అగ్నిప్రమాదాల నుంచి నివారణ ఎలా అనే విషయంలో అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ జాలయ్య తెలిపారు. వైద్యశాల సిబ్బంది, రోగులకు డెమో ద్వారా వాటి నుంచి ఎలా కాపాడుకోవాలో నేర్పించినట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. వైద్యులు, సిబ్బంది, రోగులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది శనివారం మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల కేంద్రంలోని శ్రీరంగా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాములకు పట్టాభిషేకం


రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని గరిమినపెంటగ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాములస్వామికి భక్తుల కోలాహలం నడుమ ఆనందోత్సాహాలతో, వేదపండితుల మంత్రోచ్చరణలతో సీతారాములకు పట్టాభిషేకం క్యాక్రమం నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పట్టాభిషేకం ఉత్సవంలో భక్తులు వారు పోసి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు నారాయణశర్మ పలువురు దంపతులచే అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిశోర బాలికలకు పోషక విలువలపై అవగాహన


కిశోర బాలికలకు రక్త పరీక్ష చేస్తున్న రూతమ్మ

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు పోషక విలువలపై శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి అవగాహన కల్పించారు. పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా కిశోర బాలికలకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ కిశోర బాలికలకు రక్త హీనత గురించి వివరించారు. పోషక విలువలైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్ పి.రూతమ్మ కిశోర బాలికలకు రక్త పరీక్ష చేసి వైద్య పరంగా సూచనలు, సలహాలు అందజేశారు. తల్లులు పాల్గొని స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీరాణి, ఆశా నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో స్వచ్ఛాంధ్ర


ఎక్సైజ్ కార్యాలయ పరిసరాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది


పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పుల్లలచెరువు: మండలంలోని పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలను పరిశుభ్రం చేసుకున్నారు. చెత్తా చెదారం ఎత్తేసి పరిశుభ్రం చేసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశుభ్రంగా ఉంటూ తాను ఉంటున్న పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర

దర్శి (కురిచేడు): స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేసి చెత్తను కాల్చేశారు. కార్యాలయంలో రికార్డులు శుభ్రం చేశారు. నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు మున్సిపల్ కార్యాలయంలో అప్పగించినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయానికి రిటైర్డ్ టీచర్ల వితరణ


కుర్చీలు అందజేస్తున్న రిటైర్డ్ టీచర్లు

యర్రగొండపాలెం: స్థానిక ఎంఈవో కార్యాలయానికి రిటైర్డ్ ఉపాధ్యాయులు రూ. 20 వేల విలువ చేసే సామగ్రిని శనివారం అందజేశారు. ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించిన అన్నంరాజు మురళీకృష్ణ, శంకర్‌రెడ్డి, సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య గత సంవత్సరం ఉద్యోగ విరమణ చేశారు. అప్పట్లోనే వీరు ఎంఈవో కార్యాలయ అభివృద్ధికి తమ వంతు సహాయం అందించాలనుకున్నారు. ఈ మేరకు కార్యాలయానికి మురళీకృష్ణ రూ.10 వేల విలువ చేసే కొత్త తలుపుతో పాటు కిటికీల రిపేర్లు, శంకర్‌రెడ్డి, బ్రహ్మయ్య రూ.10 వేల విలువచేసే 25 కుర్చీలు అందచేశారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించిన వారిని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూనాయక్ అభినందించారు.

చందన అలంకారంలో చెన్నకేశవుడు

మార్కాపురం టౌన్: స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నకేశవస్వామి అర్చకులు చందన అలంకారంలో స్వామివారిని అలంకరించారు. ప్రత్యేక అలంకారంలో స్వామివారిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి అలంకారం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఏడాదికొకసారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. శనివారం స్వామివారు గరుడ వాహనంపై అర్ధరాత్రి దాటిన తరువాత దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా గత కొన్ని శతాబ్దాలుగా జరుగుతున్న సాంప్రదాయం ప్రకారం గరుడోత్సవం సందర్భంగా ఆలయంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు.